క్లుప్తంగా

జ్ఞానసాగరుడు వేదవ్యాసుడు



వేదవ్యాసుడికి నమస్కరిస్తున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వేదాలను లోకానికి అందించిన జ్ఞానసాగరుడు వేద వ్యాసుడని సమరసత బాల వికాస కేంద్రం జిల్లా సహ కన్వీనర్ తాళ్లపాళెం నారాయణ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రారెడ్డి నగర్, రేబాల పడమర ఎస్సీకాలనీలో వేదవ్యాసుడి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద వ్యాసుడి చిత్రపటానికి విద్యార్థులు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని, దేశభక్తి, క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. నేటి నుంచి బాల వికాస కేంద్రాలను పునః ప్రారంభిస్తున్నామని, సాయంత్రం గంటపాటు పిల్లలకు చదువుతోపాటు కళలు, సంస్కృతి, సంప్రదాయలు, దేశభక్తి గేయాలను నేర్పుతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చిన్న పిల్లల వైద్య నిపుణుడు ఎన్వీ రాజు, గురుబ్రహ్మ పురస్కార్ గ్రహీత గండికోట సుధీర్‌కుమార్ హాజరై గురువు విశిష్టతను వివరించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అండగుండ శ్రీనివాసులు, మాతాజీ శ్రీజ, కేశవ, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల నిరసన



టిప్పర్‌లో ఇసుక లోడు చేస్తుండగా వేచి ఉన్న ట్రాక్టర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో ఆదివారం ట్రాక్టర్ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిప్పర్లకు మాత్రమే ఇసుక లోడింగ్ చేస్తున్నారని ట్రాక్టర్లకు లోడ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి కేవలం టిప్పర్లకు ఇసుక లోడు చేస్తూ సిబ్బంది అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. వేకువజాము నుంచే రీచ్‌లో ఇసుక కోసం తాము ట్రాక్టర్లను నిలిపినా తమకు బిల్లులు రాయకుండా టిప్పర్లకు మాత్రం అప్పటికప్పుడే బిల్లులు చేయడం సరికాదన్నారు. ఇసుక ఉచితంగా అందిస్తామని నమ్మబలికిన టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లు, బడాబాబులు, సిఫార్సు ఉన్న వారికే ఇసుక అందేలా చూస్తోందని మండిపడ్డారు. పేద ప్రజలకు ఇసుక అందకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రీచ్‌లో ఇంత జరుగుతున్నా పోలీసు, సెబ్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి అందరికీ ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ట్రాక్టర్ డ్రైవర్లు కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్ ఆదివారం తెలిపారు. 22న మహిమ లూరు, 23న అప్పారావుపాళెం, పడకండ్ల, చెర్లోయడవల్లి, ఆరవేడు, 24న బందారుపల్లి, కరటంపాడు, వాశిలి, రామస్వామిపల్లి, రావులకొల్లు, నాగులపాడు, 25న బట్టేపాడు, బోయలచిరివెళ్ల, మురగళ్ల, నారంపేట, నువ్వూరుపాడు, 26న దేపూరు, కనుపూరుపల్లి, నల్లపరెడ్డిపల్లి, పమిడిపాడు, వెన్నవాడ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. జల్‌జీవన్‌మిషన్, ఓడీఎఫ్ ప్లస్‌తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభల్లో చర్చించి తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో పంచాయతీల పాలకులు, అధికారులు తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.

కండక్టర్ నిజాయతీ

ఉదయగిరి: బస్సులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును భద్రంగా అందజేసి ఉదయగిరి డిపోకు చెందిన కండక్టర్ కే శ్రీనివాసులు తన నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు.. ఉదయగిరికి చెందిన సయ్యద్ మున్వర్‌బాషా ఆదివారం నెల్లూరు బస్సులో ఎక్కి పర్సును పోగొట్టుకున్నారు. కండక్టర్ శ్రీనివాసులు పర్సును గమనించి పరిశీలించగా అందులో రూ.1700 నగదు ఉన్నాయి. దీంతో పర్సును తన వద్ద ఉంచుకుని బస్సు తిరిగి ఉదయగిరికి చేరుకున్న తరువాత డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఆయన పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా బాధిత ప్రయాణికుడికి సమాచారం అందజేశారు. అనంతరం సయ్యద్ మున్వర్‌బాషా డిపో వద్దకు రాగా కండక్టర్ చేతుల మీదుగా పర్సు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా కండక్టర్‌ను పలువురు ఉద్యోగులు అభినందించారు.

ముగిసిన తహలీల్ ఫాతేహా

ఆత్మకూరు: పట్టణంలోని సుల్తాన్‌షహీద్ దర్గాలో నిర్వహిస్తున్న గంధ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు తహలీల్ ఫాతేహా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

అపరిశుభ్రతకు కేరాఫ్‌గా..





రోడ్డు పక్కన టైరు బండ్లు, ఎద్దులు

- మైపాడు రహదా పక్కన దుస్థితి
- రోడ్లపై టైరు బండ్ల నిలిపివేత
- అంటురోగాలు ప్రబలే అవకాశం
- బెంబేలెత్తుతున్న స్థానికులు

నెల్లూరు(బారకాసు): పారిశుధ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ అనేక చర్యలు చేపడుతోంది. ఓ వైపు వీధులను శుభ్రం చేస్తూ.. కాలువల్లో మురుగుతో పాటు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తోంది. అయితే కొందరు అనుసరిస్తున్న వైఖరితో అంటురోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఏర్పడుతోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా మైపాడు రోడ్డు నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లను వెచ్చించి 2.7 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు వరుసల సిమెంట్ రోడ్డుగా నిర్మించారు. మైపాడు రోడ్డుకు పక్కనే ఉన్న జాఫర్‌సాహెబ్ కాలువకు ఓ వైపు రివిట్మెంట్‌ను చేశారు. దీంతో సిమెంట్ రోడ్డు.. రివిట్మెంట్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కు తరహాలో సుందరంగా తీర్చిదిద్దేందుకు పనులు చేపట్టారు. దీనికి సంబంధించి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సిమెంట్ గచ్చును నిర్మించారు.

పనులు నిలిచిపోవడంతో యథేచ్ఛగా..

సదరు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. ఈ తరుణంలో స్థానికంగా ఉంటున్న కొందరు.. కొద్ది రోజులుగా సిమెంట్ గచ్చుపై ఎడ్లను ఉంచుతూ తమ టైరు బండ్లకు ఆవాసాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఎద్దులను అక్కడే శుభ్రపరుస్తున్నారు. ఈ తరుణంలో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రత నెలకొంటోంది. దోమలు అధికమవడంతో స్థానికులకు రాత్రి వేళ కునుకు కరువవుతోంది. మరోవైపు మైపాడు రోడ్డుపై రాకపోకలు సాగించేవారు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. వ్యాస భగవానుడి జీవితచరిత్రను సత్సంగంగా జరిపారు. ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, ధర్మకర్త వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు వేణుబాబు, కోశాధికారి వేలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సత్కారం



నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని యోగా గురువు సురేంద్రరెడ్డిని కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని ముప్పవరపు ఫౌండేషన్‌లో ఆదివారం సత్కరించారు. ఆయన వద్ద యోగ సాధన చేసే వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

నెల్లూరు (టౌన్): ఉద్యోగ విరమణల కారణంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, వీరిని వెంటనే నియమించేలా చర్యలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి కోరారు. నగరంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీలో భాగంగా మధ్యంతర భృతిని ప్రకటించడంతో పాటు గత పీఆర్సీకి సంబంధించిన బకాయిలు తదితరాలను విడుదల చేయాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రామాయణ తరంగిణిపై ఉపన్యాసం



లక్ష్మీనరసింహారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ధర్మాన్ని ఏనాడూ అతిగమించక నడుచుకున్న శ్రీరాముడి జీవితం ప్రపంచానికి ఆదర్శమని ఉపన్యాసకుడు పోలవరపు లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంత్యుత్సవాల సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయణ తరంగిణిపై లక్ష్మీనరసింహారావు ఉపన్యసించారు. తొలుత హనుమజ్జానకీరామశర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీనరసింహారావును సత్కరించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, మురళీకృష్ణ, గిరిజాలక్ష్మీప్రసాద్, చతుర్వేదుల నరసింహమూర్తి, జ్యోత్స్న, లక్ష్మి పాల్గొన్నారు

కథాసంపుటి ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నెల్లూరు జిల్లా రచయితల సంఘ సభ్యులు సండడి అరుణ రచించిన చిగురించిన చిరునవ్వు కథాసంపుటిని పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కథల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సంఘ అధ్యక్షుడు జయప్రకాష్, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, నెరసం కార్యదర్శి అన్నపూర్ణ, విశ్రాంత డీఆర్వో పెంచలరెడ్డి, రచయితలు డాక్టర్ పెళ్లకూరు జయప్రద, అరుణ, ఈతకోట సుబ్బారావు, వదలి రాధాకృష్ణ, చిన్ని నారాయణరావు పాల్గొన్నారు.

వెంకటరమణయ్య సేవలు ఎనలేనివి



నెల్లూరు(బృందావనం): శుభమస్తు షాపింగ్ మాల్, న్యూ రాజ్యలక్ష్మి హాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్య జయంతిని నగరంలోని పురమందిరంలో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కాలేషా, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణయ్యను సత్కరించారు. అనంతరం నిర్వహించిన పాటలు, శాస్త్రీయ నృత్య పోటీల్లో విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. సీనియర్ గాయకులు ఆలపించిన గీతాలు మైమరపించాయి. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, రమణారెడ్డి, రియాజ్‌బాషా, యనమల నాగేశ్వరరావుయాదవ్, నలుబోలు బలరామయ్య నాయుడు, రమణయ్య, దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలను సమర్పించండి

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించొచ్చని అదనపు కమిషనర్ శర్మద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అర్జీలను సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు సమర్పించొచ్చని చెప్పారు. వివిధ విభాగాధికారులు పాల్గొననున్నారని వివరించారు.

శాకంబరిగా గంగమ్మ తల్లి



నెల్లూరు సిటీ: పడారుపల్లిలో కొలువైన గంగమ్మ తల్లి శాకంబరి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. ఆలయాన్ని కాయగూరలతో అలంకరించారు. కాకుటూరు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు



మనుబోలు: మండలంలోని పిడూరు గ్రామం నుంచి లక్ష్మీ నరసింహపురం, కాగితాలపూరు గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు శనివారం కూలిపోయింది. పిడూరు నుంచి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉన్న ఎల్ఎన్‌పురం, కాగితాలపూరు గ్రామాలను కలుపుతూ తారు రోడ్డు ఉంది. మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఈ మార్గం దగ్గరగా ఉండడంతో ఈ రోడ్డునే వినియోగిస్తుంటారు. ఈ మార్గంలో ఉన్న ఓ కల్వర్టు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిని శనివారం కూలిపోయింది. దీంతో ప్రస్తుతం పిడూరు నుంచి ఎల్ఎన్‌పురం, కాగితాలపూరు గ్రామాలకు వెళ్లాలన్నా, అటు నుంచి ఇటు రావాలన్నా హైవేకు చేరుకుని వెళ్లాల్సి ఉంది. నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. వెంటనే కల్వర్టును పునరుద్ధరించాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉదయగిరిని జిల్లాగా చేయాలని వినతి

ఉదయగిరి: వైఎస్సార్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అన్ని విధాలా బాగా వెనుకబడిన బద్వేల్, పోరుమామిళ్ల, కనిగిరి, ఉదయగిరి, గిద్దలూరు ప్రాంతాల్లోని 21 మండలాలతో ఉదయగిరి కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం వారు అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు ఉద్యమాలు చేస్తున్నామని వివరించారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తే మెట్ట ప్రాంతాలు అన్ని విధాలా అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఉద్యమ నేతలు డాక్టర్ వేణుగోపాల్, దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా గరుడోత్సవం



నరసింహకొండలో..



చింతారెడ్డిపాళెంలో..

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 12వ డివిజన్లో గల చింతారెడ్డిపాళెంలో కొలువైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో గరుడోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవాన్ని కనులపండువగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

- నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అభిషేకాలు, గరుడసేవ, గిరిప్రదక్షిణను వేడుకగా నిర్వహించారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ రహిత దేశమే లక్ష్యం



ర్యాలీని నిర్వహిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రేబిస్ రహిత దేశమే లక్ష్యమంటూ కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్లాక్‌బోర్డు మిత్రమండలి ఆధ్వర్యంలో ర్యాలీని ఆదివారం నిర్వహించారు. బారాషహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండగను పురస్కరించుకొని చేపట్టిన ర్యాలీని ఇందుకూరుపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రేబిస్ రహిత దేశాన్ని కాంక్షిస్తూ రొట్టెను వదిలారు. కోటమిట్ట అర్బన్ సీహెచ్‌సీ వైద్యుడు నవీన్‌కృష్ణ, రాపూరు ఫైర్ ఆఫీసర్ కుప్పయ్య, నెల్లూరు ఫైర్ స్టేషన్ కానిస్టేబుల్ నారాయణ, వేణుగోపాల్, నరసాపురం ప్రసాద్, శేషయ్య, రవీంద్రబాబు, రోజారాణి, గౌస్‌బాషా, రాజేశ్వరి, కరుణకుమారి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూర్ణిమ



విశేషాలంకారంలో సాయినాథుడు



జీవీనగర్‌లోని సాయిబాబా మందిరంలో..



గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో..

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని నగరంలోని సాయిబాబా మందిరాల్లో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. బాలాజీనగర్ సమీపంలోని పద్మావతినగర్‌లో గల సాయిదర్బార్ అద్దాల మందిరంలో కాకడ, మధ్యాహ్న, సాయంసంధ్య, శేజ్ హారతులిచ్చారు. ప్రత్యేకాభిషేకాలు, ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అఖండ సాయినామ సంకీర్తన, విష్ణుసహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు. పల్లకి ఉత్సవం, ఊంజల్‌సేవ, పవళింపుసేవలను భక్తిప్రపత్తులతో జరిపారు. దాదాపు నాలుగు వేల మందికిపైగా భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్‌సింగ్, దేవకిదేవి దంపతులు, చిట్లూరి వెంకటేశ్వర్లు, ఝాన్సీలక్ష్మి దంపతులు వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

- భక్తవత్సలనగర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను షిరిడీ సాయి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిరంలో హారతులిచ్చారు. నగర సంకీర్తన, అభిషేకాలను జరిపారు. భక్తిగీతాలాపన, పాట కచేరిని కోట రామ్మోహన్‌రావు, బుజ్జయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లకిసేవను రాత్రి జరిపారు. కిలారి వరుణ్‌కుమార్ పర్యవేక్షించారు.
- గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని షిరిడీ సాయి బాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలను ప్రారంభించారు. తొలి రోజు అభిషేకాలు, పూజలు చేశారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్ర నామ పూజలను ఈ నెల 27 వరకు నిర్వహించనున్నామని మందిర నిర్వాహకుడు మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని పొదలకూరు రోడ్డులోని హెచ్ఆర్ కల్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత చాముండేశ్వరిదేవి, దేవల మహర్షికి పూజలు చేశారు. జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగశయనం, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రావు, రాఘవరావు, పరమేశ్వరరావు, ప్రకాష్, జానా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చండీహోమం



నెల్లూరు(బృందావనం): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా సూరపరాజు వరప్రసాద్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొన్నారు.

కోలాహలంగా నృత్య నీరాజనం



నెల్లూరు(బృందావనం): కళారంగానికి విశిష్ట సేవలందించిన కృష్ణకుమారిని కొనియాడుతూ నగరంలోని పురమందిరంలో నృత్య నీరాజనాన్ని ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సిద్ధేశ్వరయోగి కూచిపూడి కళాక్షేత్రానికి చెందిన వంద మంది విద్యార్థులు నృత్య ప్రదర్శనను చేపట్టారు. దేగల సాంబశివరావు, రమణయ్య, కేతా సుబ్బారావు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని విద్యాసంస్థలపై చర్యలకు వినతి

నెల్లూరు (టౌన్): జిల్లాలో అనుమతుల్లేని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని కోరారు. విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక తీర్మానం చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌యాదవ్‌తో పాటు 21 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.